క్లుప్తంగా

నియామకం..


హోమియో వైద్యురాలు అనుజ్ఞ

సారవకోట: మండలంలోని చీడిపూడి హోమియో వైద్యురాలిగా యాదల అనుజ్ఞ నియమితులయ్యారు. గత ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం ఇటీవల నియామకాలు చేపట్టింది. తాను రోగులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటానని సేవలను సద్వినియోగం చేసుకోవాలని అనుజ్ఞ తెలిపారు. ఇక్కడ వైద్యురాలిగా విధులు నిర్వహించిన ఉమాగౌరి ఏడాదిన్నర క్రితం తెంబూరుకు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఇక్కడి వైద్యులు, సిబ్బంది లేక వైద్య కేంద్రం తెరుచుకునే దాఖలాలు లేవు.

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం


అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ సింహాచలం

పాతపట్నం: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ జి.సింహాచలం అన్నారు. స్థానిక మొండిగల వీధిలో సైబర్ నేరాలపై యువతకు ఆదివారం రాత్రి సంకల్పం కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ చెడు వ్యసనాలకు అలవాటు పడొద్దని, సైబర్ నేరాలపై, డ్రగ్స్, ప్రమాదాలపై యువతకు అవగాహన కల్పించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. ఈ కార్యక్రమంలో మదన్, పోలీసులు పాల్గొన్నారు.

ప్లాటినమ్ జూబ్లీ విజయవంతం చేయండి


మాట్లాడుతున్న హెచ్ఎం గోవిందరావు

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్థాపించి 75 ఏళ్లు పూర్తి కావస్తున్నందున ప్లాటినమ్ జూబ్లీ సన్నాహక సమావేశాన్ని పాఠశాలలో హెచ్ఎం ఎ.గోవిందరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఐదు రోజులపాటు కార్యక్రమం నిర్వహించాలని చర్చించారు. ఈ కార్యక్రమం ఏప్రిల్ రెండో వారంలో నిర్వహించాలని తాత్కాలికంగా నిర్ణయించారు. ఈ నెల 26 తేదీన పాఠశాల ఆవరణలో పలు కమిటీలు వేస్తామని, పూర్వ విద్యార్థులందరూ హాజరుకావాలని కోరారు. వైస్ ఎంపీపీ తులసీవరప్రసాదరావు, మాజీ సర్పంచ్‌లు తాతబాబు, టి.తిరుపతిరావు, పూర్వ విద్యార్థులు పాలవలస కరుణాకరరావు, చోడవరపు కాంతారావు, వడమ శ్రీనివాసరావు, సింహాద్రి నాయుడు, రాజారావు, బామిడి రాజు, శ్రీకాంత్, సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా అభివృద్ధి పనులు


ప్రయాణికుల కోసం నిర్మాణం చేపడుతున్న షెడ్డు

పాతపట్నం: రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రయాణికుల కోసం విశ్రాంతి షెడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. గత రెండు నెలలుగా రైల్వే ప్లాట్ ఫామ్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. రూ.60 లక్షలతో పాతపట్నం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రయాణికుల కోసం మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ ఆధునీకరణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. మరో నెల రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు.


ప్రయాణ పాట్లు


ప్రయాణికులతో కిక్కిరిసిన గుణుపూర్-పూరి రైలు

పాతపట్నం: సంక్రాంతి ముగియడంతో సొంత గ్రామాలకు వచ్చివారు తిరిగి ప్రయాణాలు చేపడుతుండటంతో ప్రయాణికులతో పలు రైళ్లు రద్దీగా కనిపిస్తున్నాయి. పాతపట్నం రైల్వే స్టేషన్‌లో ఆదివారం గుణుపూర్-విశాఖపట్నం, గుణుపూర్-పూరి రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిశాయి. గమ్యస్థానాలకు చేరుకోవడానికి కుటుంబాలతో సహా బాగులతో పట్టుకుని రైలు ఎక్కడం కనిపించాయి. పాతపట్నం రైల్వే స్టేషన్‌లో గుణుపూర్-పూరి, గుణుపూర్-కటక్, గుణుపూర్-విశాఖపట్నం, గుణుపూర్-పలాస పాసింజర్లు ప్రయాణికులతో కిక్కిరిశాయి.

రైతు ఆశలపై పగ మంచు

- పంటలకు మంచు దెబ్బ
- మాడిపోతున్న జీడీ, మామిడి పూత
- అపరాలు, కూరగాయల పంటలకు తెగుళ్లు


ప్రహరాజపాలెంలో క్యాబేజీ పంటపై పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

మంచు దెబ్బకు మాడిపోతున్న జీడి పూత


పెసర పంటపై మంచు ప్రభావం

పాతపట్నం: మంచు దెబ్బకు రైతులు విలవిల్లాడుతున్నారు. పంటలపై పెట్టుకున్న ఆశలను మంచు చిదిమేస్తోంది. నెల రోజుల నుంచి కురుస్తున్న తేనే మంచు అపార నష్టం కలిగిస్తోంది. మంచు ప్రభావం జీడీ, మామిడి, మిరప, టమాట, క్యాబేజీ, మినుము, పెసర పంటలపై ఎక్కువగా ఉంది. సుమారు రెండు వేల హెక్టార్లలో పండిస్తున్న పంటలపై మంచు ప్రభావం ఉంది.

రైతుల ఆందోళన

మంచు వల్ల కాయ, పూతను ఆశ్రయించే రసం పీల్చు పురుగు, కుళ్లు తెగులు వంటివి ప్రధానంగా జీడీ, మామిడి పంటలపై వ్యాపిస్తున్నాయి. తెగుళ్ల ప్రభావం వల్ల పూత మాడిపోతున్నాయి. మిరప, వంగ, క్యాబేజీ పంటలకు ముడసర తెగుళ్లు వ్యాపిస్తున్నాయి. పూత దశలోనే తెగుళ్లు వ్యాపించి మాడి పోతున్నాయి. తెగుళ్ల నివారణకు అప్పులు చేసి పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. సాగునీరు సౌకర్యం లేకపోవడంతో రైతులు మెట్ట పంటలపై ఎక్కువగా మొగ్గు చూపుతుంటారు. జీడీ, మామిడి పంటలను తెగుళ్లు వ్యాపించి విపరీతంగా నష్టపరుస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు.

పూత మాడిపోయింది



గత నెల రోజులుగా కురుస్తున్న మంచుకు పూత మాడిపోయింది. ఇదేవిధంగా మంచు పడితే దిగుబడి పూర్తిగా ఉండదు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోతున్నాం. ఉద్యానవన అధికారులు తక్షణమే స్పందించి రైతులకు న్యాయం చేయాలి.

– సింగుపురం సోమేశ్వరరావు, పెద్దసరియాపల్లి, పాతపట్నం మండలం

మంచుతో నష్టం



పొగ మంచు కురవడంతో అపరాలు, కూరగాయలు పంటలు చిగురు, పూవ్వులు మాడిపోతున్నాయి. పంటను కాపాడునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నాం.

– బొంగు శ్రీరాములు, ఆర్.ఎల్.పురం, పాతపట్నం మండలం

సలహాలు ఇస్తున్నాం



మామిడి తోటకు నష్టం వాటిల్లకుండా ఉద్యానవన రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. పొగమంచు అధికంగా ఉండడంతో పురుగు ఆశిస్తుంది. ఇవి పూత, పిందెలు, కాడల రసాన్ని పీలుస్తాయి. పురుగు నివారణకు, పూత నిలవడానికి థియోమెథాక్సమ్ 0.5 మిల్లీ లీటర్లు, ఇమిడాక్లోప్రిడ్ 0.5 మిల్లీ లీటర్లను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

– ఎం.మంగమ్మ, ఉద్యానవనశాఖ అధికారి, పాతపట్నం

పాతపట్నం నియోజకవర్గంలో సాగు వివరాలు	పంట	జీడి	మామిడి	మిరప	వంగ	క్యాబేజీ	మినుము	పెసర
	ఎకరాలు	1,378	573	145	20	15	2,900	1,380

తూతూ మంత్రంగా జంగిల్ క్లియరెన్స్


పీహెచ్ రోడ్డులో వసప సమీపంలో బెర్ముపై కనిపిస్తున్న తుప్పలు

- జేసీబీతో ఇష్టానుసారంగా చేపట్టిన పనులు
- అధికారుల పర్యవేక్షణ కరువు

కొత్తూరు: మండలంలో ఇటీవల పలు రహదారుల్లో జంగిల్ క్లియరెన్స్ పనులు తూతూ మంత్రంగా చేపట్టారు. కొత్తూరు నుంచి ఒడిశా రాష్ట్రం హడ్డంగి (సరిహద్దు గ్రామం) వరకు పది కిలో మీటర్ల పొడవున ఉన్న రహదారిలో జంగిల్ క్లియరెన్స్, మరమ్మతులు, కిలో మీటర్ల రాళ్లకు తెలుపు సున్నం వేసే పనులు రూ.15 లక్షలతో చేపట్టారు. కిమిడి-వారణాసి, నివగాం-అంగూరు రహదారుల్లో జంగిల్ తొలగింపు పనులను లక్షల రూపాయలతో ప్రారంభించారు. రహదారికి ఇరువైపులా మీటరు వెడల్పుతో జంగిల్ క్లియరెన్స్ చేయాలి. క్షేత్రస్థాయిలో మాత్రం కనీసం అడుగు కూడా ఈ పనులు చేపట్టలేదు. కొన్నిచోట్ల కనీసం తొలగింపు పనులే చేయలేదు. జంగిల్ వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ఈ పనులకు ఎంతో ప్రాధాన్యం ఉంది. రహదారి నిర్వహణలో భాగంగా ఈ రోడ్డుకు ఇటీవల ఇరువైపులా ఉన్న జంగిల్స్ తొలగింపు పనులు ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో జరిగాయి. ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అభివృద్ధి పనుల్లో నాణ్యత కొరవడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పనుల్లో నాణ్యత లేదు

పీహెచ్ రోడ్డులో జంగిల్ క్లియరెన్స్ పనులను పరిశీలించాను. పనుల్లో నాణ్యత లోపించింది. జేసీబీతో పనులు చేయడం వల్ల మొక్కలు పూర్తిగా తొలగలేదు. పనులు మరోసారి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించాం.

– గోపాలరావు, జేఈ, ఆర్అండ్‌బీ, కొత్తూరు మండలం

కాకర్ల చెరువులో పంటలు వేస్తే చర్యలు


పంటలు తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

జలుమూరు: చిన్నదూగాం పంచాయతీ పరిధి కాకర్ల చెరువు సర్వే నంబర్ 48లో ఒకటి, 59లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు పంటలు వేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జెన్ని రామారావు హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం మండల సర్వేయర్ నాగేశ్వరరావు, ఆర్ఐ కిరణ్, రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. గతంలో ఇదే చెరువులో ఎన్జీటీ ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగించారు. కోర్టు ధిక్కారంగా మళ్లీ ఇప్పుడు అదేచోట పెసర, మినుము, చోడి, తదితర పంటలను వేశారని, వాటిని తొలగించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

పక్షపాతం వైఖరి సరికాదు..

ఇదే చెరువులో ఆక్రమణలపై ఎన్జీటీ ఉత్తర్వులు ఇచ్చినా గ్రామానికి చెందిన రైతులు దుబ్బ ముఖలింగం, పాగోటి సింహాద్రి, రావాడ శిమ్మన్నకు చెందిన పంటలను అధికారులు తొలగించలేదని గరీబ్ గైడ్ ప్రతినిధి డాక్టర్ డీవీ రావు ఆరోపించారు. పూర్తి స్థాయిలో పంటలను తొలగించాని, పక్షపాత వైఖరి సరికాదన్నారు.

అందని రేషన్ సరుకులు

సారవకోట: మండలంలోని బుడితి బీసీ కాలనీతోపాటు పలు వీధుల్లోని రేషన్ కార్డుదారులకు ఈ నెల 19 తేదీ వచ్చినా రేషన్ సరుకులు అందలేదని పలువురు ఆరోపించారు. పండగ ముందే రేషన్ సరుకులు అందజేస్తే బంధువులకు ఉపయోగపడతాయని అనుకున్నామన్నారు. ఇంతవరకు రేషన్ సరుకులు అందజేయలేదని స్థానికులతోపాటు మాజీ ఎంపీటీసీ, విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నిక్కు హరి సత్యం ఆదివారం తెలిపారు.

నేటినుంచి పశువైద్య శిబిరాలు

సరుబుజ్జిలి: ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు మండలంలోని పలు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సి.హెచ్.సుబ్రహ్మణ్యం ఆదివారం ప్రకటనలో వెల్లడించారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పాడిరైతులు, పెంపకందారులు తమ పశువులను శిబిరాలకు తరలించాలని కోరారు.

ఆమదాలవలస మండలంలో..

ఆమదాలవలస: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ సోమవారం నుంచి పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ ఆర్.ఆనందరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకేరోజు రెండు గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తామన్నారు. మండలంలో 11 రోజులపాటు నిర్వహించే ఈ శిబిరాలకు ఇద్దరు డాక్టర్లు ఒక్కో టీమ్‌కు ఒకరు చొప్పున బాధ్యత వహిస్తారన్నారు. మిగతా సిబ్బంది రెండు బ్యాచ్‌లుగా పనిచేస్తారన్నారు.

రీసర్వే సక్రమంగా చేపట్టాలి

సరుబుజ్జిలి: గ్రామాల్లో భూముల రీసర్వే సక్రమంగా చేయాలని అధికారులను స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశించారు. మండలంలోని యరగాం గ్రామంలో ఆదివారం భూ సర్వే ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులు, సచివాలయం సిబ్బంది ప్రభుత్వ భూములు కాపాడేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రధానంగా దేవాదాయ భూములు, గ్రామకంఠాలు, ప్రభుత్వ భూముల విషయంలో అధికారులు బాధ్యతగా రీసర్వేలు నిర్వహించి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్.మధుసూదన్, రీసర్వే డీటీ జగదీష్, సర్వేయర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

పేదలకు అండగా నిలుద్దాం


బొబ్బిలిపేటలో మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్

ఆమదాలవలస: అధికార తెలుగుదేశం పార్టీ చేస్తున్న అరాచకాలను సమష్టిగా ఎదిరించి, పేదలకు అండగా నిలుద్దామని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. ఆమదాలవలస మండలంలోని చింతలపేట, దండేవలస గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆదివారం సాయంత్రం ఆయా గ్రామాల సమస్యలపై చర్చించారు. కూటమి నాయకులు కుట్ర పన్ని చేస్తున్న పెన్షన్ల తొలగింపు, సచివాలయాన్ని తరలించడం, రోడ్లు, కాలువల నిర్మాణాల్లో అవకతవకలు, తదితర విషయాలను, అరాచకాలను కార్యకర్తలకు అడిగి తెలుసుకున్నారు.

పార్టీ సీనియర్ నాయకులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ గురుగుబెల్లి చలపతిరావు, పేడాడ శశిభూషణ్, బాలసుందర్, కంచు శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత లక్ష్మీనర్సుపేట


విజేతలకు బహుమతులు అందజేస్తున్న చంద్రశేఖరరాజు

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో గల ప్రభుత్వ జూనియర్ కాలేజీ క్రీడా ప్రాంగణంలో జరిగిన శ్రీబంగారు తల్లి క్రికెట్ పోటీల్లో లక్ష్మీనర్సుపేట టీమ్ విజేతగా నిలిచిందని నిర్వాహకుడు వైశ్యరాజు చంద్రశేఖరరాజు (పొట్టి రాజు) తెలిపారు. లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన శ్రీబంగారు సంతోషి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి క్రికెట్ పోటీల్లో మండలానికి చెందిన 16 జట్లు పాల్గొన్నాయి. లక్ష్మీనర్సుపేట, మిరియాపల్లి ఫైనల్లో పోటీ పడ్డాయి. లక్ష్మీనర్సుపేట విన్నర్‌గా, మిరియాపల్లి రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు


కొత్తూరు జంక్షన్ వద్ద పరిశీలిస్తున్న ఎస్ఐ అనిల్ కుమార్

సారవకోట: జాతీయ రహదారి 326–'ఎ'పై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. మండలంలో జాతీయ రహదారిపై ఎక్కడెక్కడ ప్రమాదాలు ఇదివరకు జరిగాయి, జరిగే అవకాశం ఉన్న ప్రదేశాలను ఆదివారం గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. దీని కోసం వేగ నిరోధకాల ఏర్పాటు, స్టాప్ బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

పారిశ్రామిక నైపుణ్యాలపై అవగాహన


విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రసాద్‌రెడ్డి

నరసన్నపేట: విద్యార్థులు పారిశ్రామిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రసాద్ రెడ్డి అన్నారు. స్థానిక పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రత్యేకంగా పారిశ్రామిక అంశాలపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. టెక్నాలజీ సెంటర్ల ద్వారా చిన్న పరిశ్రమలకు మరింత ఊతమివ్వడం ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల శాఖ) ఆశయమన్నారు.

పరిశ్రమలకు అవసరమైన నిపుణులైన మానవ వనరులను తయారు చేయడమే ధ్యేయంగా స్కిల్ సెంటర్లు పనిచేస్తున్నాయన్నారు. డిగ్రీ కళాశాల డైరెక్టర్ సి.హెచ్. దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నీలమణిదుర్గమ్మకు ప్రత్యేక పూజలు


నీలమణిదుర్గమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు పాతపట్నం పరిసర గ్రామాలకు చెందిన భక్తులు ఘటాలతో తరలివచ్చారు. ప్రతీ సంవత్సరం సంక్రాంతికి వచ్చిన బంధువులు, దూర ప్రాంతాల నుంచి సొంత ఇంటికి వచ్చినవారు అమ్మవారి ఆలయానికి రావడంతో కిటకిటలాడింది. అమ్మవారికి ముర్రాటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మంచుతో అవస్థలు



ఈ చిత్రం హిరమండలం మండలంలోని ధనుపురం వద్ద ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో కురుస్తున్న దట్టమైన పొగమంచు. గత కొద్ది రోజులుగా ఉదయం 9 నుంచి 10 గంటల వరకు మంచు కురవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

– హిరమండలం

వేగ నియంత్రికల ఏర్పాటు

ఆమదాలవలస: రహదారి ప్రమాదాల నివారణ కోసం వేగ నియంత్రికలను పలు కూడళ్లలో ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ సనపల బాలరాజు ఆదివారం తెలిపారు. పట్టణ పరిధిలో తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించారు. కొర్లకోట జంక్షన్, సెయింట్ ఆన్స్ స్కూల్ జంక్షన్ల వద్ద వేగ నియంత్రికలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధిక వేగంతో వచ్చే వాహనాలను నియంత్రించవచ్చునన్నారు. వాహనదారులు రహదారి నిబంధనలను పాటిస్తే ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు. వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్‌ను ధరించి ప్రయాణాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అపూర్వ కలయిక


జలుమూరు: 2003-08 బ్యాచ్ విద్యార్థులు


మెళియాపుట్టి: 1980-90 టెన్త్ బ్యాచ్

జలుమూరు: మండలంలోని తిమడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–2008లో ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుని సంతోషంగా గడిపారు. ఈ బ్యాచ్‌లో ఆర్థికంగా వెనుకబడిన వారికి చేయూత ఇవ్వడంతో పాటు పాఠశాల అభివృద్ధికి తమవంతుగా సాయం అందించాలని తీర్మానం చేశారు.

ఆత్మీయ సమ్మేళనం

మెళియాపుట్టి: రకరకాల ఉద్యోగాలు, వృత్తులు, బాధ్యతలు ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. వారందరినీ సంక్రాంతి ఒకచోటికి చేర్చింది. చాపర జిల్లా పరిషత్ పాఠశాలలో 1989–90లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ ఆదివారం వారు చదువుకున్న పాఠశాలలోనే ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన గురువులు వై.ఎస్.ప్రకాశం, డి.ఎ.స్టాలిన్, ఎన్ని లోకనాథం, టి.తుకారాం, తదితరులను ఘనంగా సత్కరించారు.